క్లుప్తంగా

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



శృంగవృక్షంలో డైరెక్టర్ కొడవత్తి శివప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాలకోడేరు: నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని పలువురు వక్తలు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సమావేశం పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామనాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ మాట్లాడుతూ కార్యవర్గ సమావేశంలో ముఖ్యంగా మూడు సమస్యలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పలపు దుర్గా పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుమర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన గృహాన్ని నిర్మించుకోండి

భీమవరం(ప్రకాశం చౌక్): పేదలు అందమైన నాణ్యమైన ఇళ్లను త్వరగా నిర్మించుకోవడానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. విస్సాకోడేరు లే అవుట్‌లో గృహ లబ్ధిదారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పిచ్చయ్య, ఎంఈ త్రినాథ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగిపై విచారణ

ఉండి: గతంలో వచ్చిన ఆరోపణలపై ఓ వైద్య ఉద్యోగిపై ప్రస్తుతం విచారణ ఎదుర్కొంటున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే తెలిసిన వివరాల ప్రకారం ఉండి మండలం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం డిప్యూటేషన్ (రీడిప్లమెంట్)పై సుమారు రెండేళ్ల క్రితం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఓ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లాడు . అక్కడ విధులు నిర్వర్తిస్తూ మరికొన్ని పీహెచ్‌సీలకు ఇన్‌చార్జ్‌గాను వ్యవహరిస్తున్నాడు. గత ఉమ్మడి జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సమయంలో అతనిపై పలు ఆరోపణలు రావడంతో అప్పటి అధికారులు అతనిపై చర్యలకు ఉపక్రమించారు. అయితే ఇప్పుడు మరికొన్ని ఆరోపణలు రావడమో లేదా గత ఆరోపణలపై గురు, శుక్రవారాల్లో అతనిపై చర్యలకు ప్రత్యేక విచారణ జరిగి శాఖాపరమైన చర్యలకు ఆదేశించినట్లు తెలిసింది.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తాం



ఆకివీడు సీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంక్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక సీహెచ్‌సీలో బ్లడ్ బ్యాంక్ కేంద్రాన్ని శుక్రవారం ఉపసమాపతి కే రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ నాగరాణి, ఆసుపత్రిలో జనరేటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించేందుకు త్వరలో ఆరోగ్యశ్రీ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు మండల కమిటీ అధ్యక్షుడు మొట్టపల్లి ప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నరసాపురం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ శుక్రవారం స్థానిక కోర్టు సముదాయం వద్ద సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దానయ్య నాయుడు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి తేవాలని కోరారు. డెత్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని, న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు.

దుర్గమ్మ ఆలయంలో అన్నదానం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాజమండ్రికి చెందిన బీరం నరసింహరావు, విజయలక్ష్మి దంపతులు, వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పల్లె రహదారులు.. వర్షాలకు మడుగులు

- అధ్వానంగా ఉప్పులూరు, యండగండి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఉండి: మండలంలోని ఉప్పులూరు, యండగండి పరిధిలోని పల్లెదారుల గోతుల్లో వర్షపు నీరు చేరి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండల కేంద్రాలను కలిపే కొన్ని రోడ్లు ఇదే దుస్థితిలో ఉన్నాయి. అడుగడుగునా గుంతలు పడటంతో ద్విచక్రవాహనాలు తిరగడానికి సైతం అవాంతరంగా మారాయి. అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి ఆరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఉప్పులూరు, యండగండి ఆర్అండ్‌బీ రహదారి అత్యంత అధ్వాన్నంగా మారింది. ఉప్పులూరు సరిహద్దు నుంచి యండగండి గ్రామంలో గరగపర్రు, తాడేపల్లిగూడెం రోడ్డు వరకు సుమారు 3కి.మీ ప్రయాణం నరకాన్ని తలపిస్తుంటూ ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డులో కోలమూరు, ఉప్పులూరు, కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ, యండగండి ఈ ఆరు గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతి రోజు భీమవరం ప్రాంతానికి రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే విద్యార్థులు యండగండి జూనియర్ కళాశాలకు ఆయా గ్రామాలకు చెందిన రోగులు యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలంటే ఈ రోడ్డుపైనే ప్రయాణించాలి. రోడ్డు రోజురోజుకూ అధ్వానంగా మారడంతో ప్రతి రోజు ఎన్నో ద్విచక్రవాహనాలు, ఆటోల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఇదంతా ప్రజల ఖర్మ అన్నట్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. అడుగకు ఒక గొయ్యి అన్నట్లుగా రోడ్డు మారిందని దీనిపై ఎవ్వరూ ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదంటూ ప్రజలు ఆరా తీస్తున్నారు. పగటి సమయంలో గోతులమయమైన రోడ్డు రాత్రి వేళల్లో ప్రయాణికులకు గోతులు కనిపించకపోవడం, పెద్ద గోతుల్లో పడిపోవడంతో ఈ రహదారిపై ప్రయాణం అంటే ప్రాణాపాయం తప్పదేమో అన్నట్లుగా రోడ్డు మారిపోయింది. ఎందుకంటే ఉప్పులూరు నుంచి యండగండి పరిధి వరకు రోడ్లపై ఎటువంటి లైట్లు లేకపోవడంతో సైకిళ్లపై వెళ్లే రైతులు ప్రమాదాల బారిన పడిపోతున్నారు. వాహనదారులు, కార్లు, ఆటోలు తప్పనిసరిగా ప్రమాదాలను చవిచూడాల్సిన పరిస్థితి రావడంతో వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఏదైనా అనారోగ్య సమస్యతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా మెరుగైన వైద్యం కోసం భీమవరం వంటి ప్రాంతానికి వేగంగా వెళ్లాలన్నా ఈ రోడ్డుపై కుదరని పనిగా మారిపోయింది. ఒకవైపు సమాన్య ప్రజలు మరోవైపు రోగులు, వాహనదారులు, విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్న ఈ రోడ్డును ప్రజాప్రతినిధులు, అధికారులు ఒక్కసారి పరిశీలించి కనీసం మరమ్మతులు అయినా చేయిస్తే బాగుంటుందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా మారిన ఉప్పులూరు, యండగండి రహదారి





ప్రజల ప్రాణాలు పట్టించుకోండి



చాలా కాలం నుంచి ఉప్పులూరు నుంచి యండగండి వెళ్లాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. కారణం రోడ్డుపైనే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనం అదుపుతప్పితే ప్రాణాపాయం తప్పదు అన్నట్టుగా మారిపోయింది. విద్యార్థులు, రైతులు, రోగులు తప్పనిసరిగా ప్రయాణించే రోడ్డు ఇది. తక్షణమే రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

నిమ్మల కేశవకుమార్(బాలు), ఎంపీటీసీ ఉప్పులూరు

ఆరు గ్రామాల ప్రజలకు ఇదే దారి



విద్య, వైద్యం కోసం తప్పనిసరిగా ఆరు అంతకంటే ఎక్కువ గ్రామాల ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణించాల్సిందే. ఆస్పత్రికి, కాలేజీకి వెళ్లాలంటే ఈ దారిలోనే ప్రయాణించాలి. భీమవరం వంటి ప్రాంతాలకు వెళ్లాలన్న ఈ రహదారి దగ్గరగా ఉంటుంది. ఇంత అత్యవసరమైన రహదారిని అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు.

మరమ్మతులు చేపట్టండి



రోడ్డు నిర్మాణం చేయకపోతే కనీసం మరమ్మతులైపా చేయండి. భారీగా దర్శనమిస్తున్న గోతులతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులైనా కనీసం పట్టించుకొని రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నాం.

మానుకొండ సురేష్‌కుమార్, స్థానికుడు, యండగండి.

భీమవరంలో ఆర్టీసీలో డ్రైవర్స్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో ఆర్టీసీ డిపోలో రోజువారి వేతనంతో అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్స్‌గా పనిచేయుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శుక్రవారం అసిస్టెంట్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్స్ తీసుకుని 18 నెలలు పూర్తి అయి ఉండాలని, డ్రైవర్స్ బయోడేటా పరిశీలించి ఎటువంటి యాక్సిడెంట్‌లు లేనట్లుగా మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఇచ్చే ధ్రువపత్రం, ఆధార్ కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో డిపో మేనేజర్ కార్యాలయానికి రావాలని, రికార్డు పరిశీలన అనంతరం మెడికల్ పరీక్షలు, శిక్షణ అనంతరం సెలెక్ట్ అయినవారిని రోజువారి వేతనానికి తీసుకుంటామని వివరించారు. మీ దరఖాస్తులను భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఇతర వివరాలకు 8341543351నంబరులో సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ కాళీ చరణ్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై వివిధ కళాశాలల్లో, వివిధ ప్రాంతాల్లోని మహిళలకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రయాణాలు చేసినప్పుడు, మన రక్షణ కోసం పోలీసులకు సమాచారం అందించడానికి 112 కు డయల్ చేయడం గాని, శక్తి యాప్ ఉపయోగించడం గాని చేయాలని సీఐ సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సమతం వెంకయ్య నాయుడు అధ్యక్షత వహించగా, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ మాయాజాలంలో ఎంతోమంది మోసపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నరేష్, స్వామి, నాగేశ్వరరావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై పోరాటం



సంఘ నాయకులను సత్కరిస్తున్న డీలర్లు

నరసాపురం: రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రేషన్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అధికారి ఏసు, కార్యదర్శి కనగళ్ల బాబు, సంయుక్త కార్యదర్శి సమయమంతుల సర్వేశ్వరరావు తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన ముగ్గురు నేతలను శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీలర్లు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం డీలర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటి పరిష్కారానికి కలసికట్టుగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం మహేష్, పొన్నమండ యుగంధర్, జల్లూరి శ్రీనివాస్, శిరిగినీడి మరళి, తటపర్తి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

27న వైఎస్సార్ సీపీ మండల, పట్టణ సమావేశం

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో సాయిబాబా కల్యాణ మండపంలో ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు వైఎస్సార్ సీపీ మండల, పట్టణ విస్తృత స్థాయి సమావేశం జరుగునుందని మండల పట్టణ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉండి నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నరసింహ రాజు హాజరవుతారని చెప్పారు. ఆకివీడు పట్టణ, రూరల్ మండలంలోని అన్ని గ్రామాలలోని వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్లు, అనుబంధ విభాగాల సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

కంటి రుగ్మతలను అశ్రద్ధ చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి

తణుకు అర్బన్: కంటి రుగ్మతలను అశ్రద్ధ చేస్తే కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి అన్నారు. శుక్రవారం తేతలిలోని ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులకు ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో పాలకొల్లు లయన్స్ ఆధ్వర్యంలో రాజవల్లి రాధారామన్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ మానవ దేహంలో కంటికి ఎంతో ప్రాధాన్యత ఉందని, కంటిచూపు లేకపోతే జీవితం అంధకారంగా మారుతుందని స్పష్టం చేశారు. ఇదే ఉద్దేశంతో తమ ఇండస్ట్రీస్‌లోని కార్మికులు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్మికులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 365 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 11 మందికి కాట్రాక్ట్ శస్త్రచికిత్సలు, 5 గురికి కంటి పై పొర శస్త్రచికిత్సలు అవసరం ఉన్నట్లు వైద్యులు గుర్తించారని వారందరికీ శస్త్రచికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేయనున్నామని, 72 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్లూరి లక్ష్మీపతిరాజు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ జి.గీతాబాయ్ సూచించారు. తణుకు బ్యాంక్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా మునిసిపల్ సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రక్షిత మంచినీరు తాగడం ద్వారా డయేరియా బారినపడకుండా ఉండవచ్చనే విషయాన్ని ప్రజలకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు తప్పవు

స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణుల విషయంలో లింగ నిర్ధారణకు పాల్పడితే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతాబాయ్ హెచ్చరించారు. తణుకు పట్టణంలో శుక్రవారం పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా యాజమాన్యాలు తమ కేంద్రాల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు.

స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలి

కాళ్ల: స్వామి వివేకానంద సేవాసమితి ఏర్పాటు చేసి దాని ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న వేగిరాజు శివవర్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ సి.నాగరాణిలు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం పరిధిలో రతన్ టాటా మార్గం నుంచి కె.కన్వెన్షన్ ఎక్స్ రోడ్డు వరకు సుమారు రూ.2.75 కోట్లతో నూతనంగా నిర్మించిన స్వామి వివేకానంద మార్గ్ సీసీ రోడ్డు, కల్వర్టులను శుక్రవారం ప్రారంభించారు. స్వామివివేకానంద సేవాసమితి పర్యవేక్షణలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.86 లక్షలు, సమితి ద్వారా కె.కన్వెన్షన్ యాజమాన్యం నిధులు రూ. 69.50 లక్షలు, విఎస్ఎస్ గార్డెన్స్ యాజమాన్యం రూ. 69.50 లక్షలు, ఈ సీసీరోడ్డుకి ఇరువైపులా ఉన్న కాలనీ పెద్దల నిధులు రూ.50 లక్షలతో సుమారు 1.25 కి.మీ పొడవున నిర్మించిన ఈ మార్గానికి స్వామి వివేకానంద మార్గ్ పేరు పెట్టడం శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధి వేగిరాజు శివవర్మ, ఎంపీపీ పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కటారి వెంకట నరసింహారాజు, కంతేటి ఉషా శ్రీనివాసరాజు, కూటమి నాయకులు, అధికారులు, సేవాసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భావితరాల ఆరోగ్యానికి సేంద్రియ సాగు



మాట్లాడుతున్న డీపీఎం నూకరాజు

తాడేపల్లిగూడెం రూరల్: భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై. నూకరాజు కోరారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూకరాజు మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న పొలంలో కొంత సేంద్రియ విధానంలో పంటలు పండించాలన్నారు. పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, కషాయాల ద్వా రా వ్యవసాయం చేయాలన్నారు. తద్వారా సాగులో ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కోడిగుడ్లు నిమ్మరసం ద్రావణం, అగ్నాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు ఏఓలు నారాయణరావు, చిర్ల రవికుమార్, ఏఈఓ డి.విద్యాసాగర్, తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆంబోతు మృతి

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆంబోతు గాయాల బారిన పడి మృతి చెందింది. స్థానిక జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఘటనలో ఆంబోతు వెనుకవైపు భాగం తీవ్ర గాయాలయ్యాయి. వెటర్నరీ వైద్యులు ఆంబోతుకు చికిత్స అందజేశారు. కొద్దిసేపు అనంతరం ఆంబోతు మృతి చెందింది.

శ్రావణం.. ఆధ్యాత్మిక తోరణం



భీమవరంలో ఓ బట్టల షాపుల్లో కొనుగోలుదారులు



భీమవరంలోని ఓ కళ్యాణ మండపం

- వరలక్ష్మి వ్రతాలకు మహిళల ఏర్పాట్లు
- ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రావణం అంటే మహిళలు వరలక్ష్మినే నేలంతా మనసారా కొలిచే మాసం. ఈనెలలో వచ్చే శుక్రవారాల్లో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవార్ల దేవస్థానాలు, ఆలయాలు ఈనెల రోజులూ భక్తులతో కిటకిటలాడుతుంటాయి. సామూహిక లక్ష్మీదేవి వ్రతాలకు నిలయమవుతాయి. శ్రావణ మాసం ఈనెల 25వ తేదీ శుక్రవారం నుంచి మొదలు కావడంతో జిల్లాలోని మహిళలు తమ వీలును బట్టి ఫలానా శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే నెల8న శ్రావణ శుక్రవారం కావడంతో ఆరోజు జిల్లాలో అధిక సంఖ్యలో మహిళలు వ్రతాలు జరుపుకోనేందుకు సమాయత్తమవుతున్నారు. ఈనెల 26 తేదీ నుంచి మూహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లకు, గృహప్రవేశాలకు, భూమి పూజలకు ముహూర్తాలు పెట్టుకుంటున్నారు.

భీమవరం మార్కెట్ సందడి:

శ్రావణ మాసం రావడంతో భీమవరం మార్కెట్ సందడి మొదలైంది. పెళ్లిళ్ల ఇతర ఫంక్షన్లకు అవసరమైన వాటి కొనుగోళ్లతో మార్కెట్ బీజీగా మారింది. జిల్లాలోనే భీమవరం పట్టణం బట్టలు, బంగారం, ఇతర షాపింగ్‌లకు పెట్టింది పేరు కావడంతో జిల్లా నలమూల నుంచి జనం భీమవరం రావడం జరుగుతుంది. ముఖ్యంగా పెళ్లిళ్లు ఉండడంతో బంగారం, బట్టల షాపుల కొనుగోళ్లదారులతో సందడిగా మారుతున్నాయి. ఆషాడంలో వెలవెలబోయిన షాపులు నేడు జనంతో సందడిగా ఉన్నాయి. ప్రతి ఏడాది శ్రావణ మాసంలో భీమవరంలో బట్టల, బంగారంపై రూ.50 కోట్ల వ్యాపారం సాగుతుంది.

ముందుగానే బుక్ అవుతున్న కల్యాణ మండపాలు

శ్రావణ మాసం కావడం ఈనెల 26 తేదీ నుంచి వరస పెళ్లి ముహూర్తలు ఉండడంతో భీమవరంలోని కల్యాణ మండపాలు, విడిది ఇల్లులు ముందుగానే బుక్ అవుతున్నాయి. భీమవరం పట్టణంలో పెద్దవి, చిన్నవి కలుపుకుని మొత్తం 15 వరకు కల్యాణ మండపాలు ఉన్నాయి. వాటి అద్దెలు రూ. 30 వేలు నుంచి రూ. 2 లక్షల వరకు ఉంటుంది. అలాగే భీమవరంలోని ప్రముఖ శివక్షేత్రం పంచారామక్షేత్రం, జువ్వలపాలెం రోడ్డులోని శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రతి ఏడాది పెళ్లీలు భారీగా జరుగుతాయి. పెళ్లీల మూహూర్తలు ప్రారంభంకావడంతో ముందుగాను ఆయా దేవస్థానాలల్లో పెళ్లీలకు ముందుగా రిజస్ట్రేషన్లు చేసుకుంటున్నారు.

సౌభాగ్యానిచ్చే శ్రావణం



స్త్రీలకు సౌభాగ్యానిచ్చేది శ్రావణమాసం. స్త్రీల వ్రతాలన్నీ ఈ మాసంలోనే చేస్తారు. శుక్ర, మంగళవారాలతో పాటు వివాహాది శుభకార్యాలు నిర్వహించడానికి మంచి మాసం. ఆ మేరకు పెళ్లివారు ముందుగానే ముహూర్తాలు పెట్టించుకుని ఆ ఏర్పాట్లులో నిమగ్నమవుతున్నారు.

మద్దిరాల మల్లిఖార్జున శర్మ (చిన్ని) శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకులు